క్లుప్తంగా

సీఎం దృష్టికి 'గూడెం' సమస్యలు



సమస్యలను సీఎంకు వివరిస్తున్న ఎమ్మెల్యే

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సచివాలయంలో కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన ప్రధాన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిచి పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): మున్సిపల్ కాంట్రాక్ట్. ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి ముత్యాల విశ్వనాథం అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ఎ.స్వామికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ... రోజురోజుకు నిత్యావసరాల ధరలు పెరుతున్న తరుణంలో కార్మికులకు వేతనాలు సరిపోవడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం రూ.24వేలు ఇవ్వాలన్నారు. అడుసుపల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, జకరయ్య, లాల్‌పాషా పాల్గొన్నారు.

పేపర్‌లెస్ సంస్థగా మార్చాలి

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): సింగరేణి ఐటీ ఈఆర్‌పీ విభాగాలను సింగరేణి డైరెక్టర్(పా) ఎన్వీకే శ్రీనివాస్ బుధవారం ఆయన చాంబర్‌లో అభినందించారు. డైరెక్టర్(పా) మాట్లాడుతూ... సింగరేణి ఉద్యోగుల సమాచారానికి సేవలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగిస్తున్నందుకు గుర్తింపుగా కంప్యూటర్ ఎక్స్‌ప్రెస్ అనే సంస్థ జాతీయస్థాయిలో అత్యుత్తమ ఐటీ సేవల కంపెనీగా, ఎంటర్‌ప్రైజెస్ అప్లికేషన్ కేటగిరిలో ఈ అవార్డు రావటం సంతోషమని, మరిన్ని అవార్డులను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు.

హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి



క్యాంపును ప్రారంభిస్తున్న శ్రీనివాస్

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): సింగరేణి వ్యాపిత 11 ఏరియాలలోని మహిళా ఉద్యోగినులు, కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు సింగరేణి వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా జీవించాలని సింగరేణి డైరెక్టర్(పా) ఎన్వీకే శ్రీనివాస్ కోరారు. బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని కేసీఓఏ క్లబ్‌లో హైదరాబాద్‌కు చెందిన బసవతారక ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి వారి సౌజన్యంతో మహిళల కోసం ఏర్పాటు చేసిన బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఆయన, లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు వాణీ సత్యనారాయణరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మాట్లాడుతూ... సింగరేణి సీఎండీ ఆదేశాల మేరకు 45 సంవత్సరాల పైబడిన వారి కోసం ఈ క్యాంపును ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల

- భయం గుప్పిట్లో విద్యార్థులు.. ఆందోళనలో తల్లిదండ్రులు
- ప్రారంభానికి నోచుకోని అదనపు తరగతుల భవనం
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో ఉన్న జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో శిథిలావస్థ భవనంలోనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. ఇందులోనే తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు భయం భయంగా చదువుకోవాల్సిన దయనీయ స్థితి. ఏ ప్రమాదం ఎప్పుడు ముంచుకోస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. సర్కార్ బడులు అంటే ఇలాగే ఉంటాయని చెప్పడానికి ఇదో నిదర్శనంగా చెప్పవచ్చు. పాఠశాల భవనం శిథిలం కావడంతో స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడంతోపాటు, ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా తరగతి గదులు తడిసి ముద్ద అవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో ఇప్పటికే 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు మొత్తం 100 మంది ఉన్నారు. 1979–1980లో నిర్మించిన భవనంలోనే తరగతులు కొనసాతుండటం విశేషం. ఈ భవనంలో ఐదు తరగతి గదులు ఉండగా.. రెండు గదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. మూడు గదులు అంతంతమాత్రంగా ఉండగా వరండా కూడా వర్షం వస్తే కురుస్తుంది. ఈ రెండు తరగతి గదులతోపాటు, మరో భవనంలో ఆఫీస్ రూమ్, వరండా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడంతోపాటు, పాఠశాల విద్యను అభివృద్ధి చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన మన ఊరు – మన బడి కార్యక్రమానికి మొదటి విడతలో జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎంపికైంది. అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.39 లక్షలు మంజూరయ్యాయి. నిర్మాణ పనులకు 2022లో ఆనాటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తై ఏడాదిన్నర అవుతున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిల్వ ఉంటుండడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. ఇలాంటి పరిస్థితులు ఉన్న బడికి పిల్లలను ఎలా పంపించాలని? ప్రమాదం పొంచి ఉందని తెలిసి కూడా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద వానలు వస్తే పాఠశాల భవనం కూలి పడుతుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అదనపు తరగతి గదుల భవనం

బడికి రావాలంటే భయంగా ఉంది



ప్రమాదకరంగా ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తుండటంతో ఎప్పుడు కూలిపడుతోందని భయంగా ఉంది. వర్షం వస్తే తరగతి గదుల్లోకి నీళ్లు వస్తాయి. కూర్చోనే పరిస్థితి ఉండదు. ఒకవేళ కూర్చుంటే స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. అందుకే బడికి రావాలంటే భయంగా ఉంది.

– మందా కీర్తన, 4వ తరగతి

భవనాన్ని అప్పగించ లేదు..



అదనపు తరగతి గదుల భవనాన్ని కాంట్రాక్టర్ అప్పగించలేదు. పాత భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రమాదకరంగా ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తుండటంతో ఏమీ జరుగుతుందోనని భయంగా ఉంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, కొత్త భవనంలో తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– బి.నేతాజీ, హెచ్‌ఎం

పనులు పూర్తి కాలేదు



అదనపు తరగతి గదుల పనులు పూర్తిస్థాయిలో కాలేదు. భవనాన్ని కాంట్రాక్టర్ పాఠశాలకు అప్పగించలేదు. పాత భవనంలోనే తరగతులు నిర్వహించాల్సి వస్తుంది. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. పనులు పూర్తి కాగానే తరగతులు అందులో జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– గుగులోతు వెంకట్, ఎంఈఓ, జూలూరుపాడు

పెండింగ్ వేతనాలు చెల్లించండి..



జూలూరుపాడు: ఎంపీఓ చిరంజీవికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఇఫ్టూ అనుబంధ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీఓ చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రతీరోజు పారిశుద్ధ్య పనులు చేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న పంచాయతీ వర్కర్లకు నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఆరు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, కనీస వేతనం నెల వేతనం రూ.27వేలు చెల్లించాలని, ఆదివారం సెలవుదినంగా అమలు చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌని నాగేశ్వరరావు, నర్సింహారావు, సామేలు, కిషోర్, తిరుపతి, శ్రీను, వీరబాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు డిమాండ్ చేశారు. బహుజన కార్మిక విభాగం ఆధ్వర్యంలో బుధవారం జీపీ కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు.

పేదలకు గూడు కల్పించే బాధ్యత సీపీఐదే



డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని పాత కొత్తగూడెంలో పేదలకు కేటాయించిన ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో లబ్ధిదారులు అపోహపడొద్దని, ఇంటి నిర్మాణం చేసుకోవచ్చని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ కంచర్ల జమలయ్య అన్నారు. బుధవారం పాతకొత్తగూడెంలోని పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల ప్రాంతాన్ని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సీపీఐ నాయకులు, కౌన్సిలర్ల బృందం సందర్శించింది. జమలయ్య మాట్లాడుతూ... కొందరు దళారులు లబ్ధిదారుల్లో అపోహలు సృష్టిస్తున్నారని, వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని, త్వరలో అందుకు సంబంధించిన పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు. ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులు, మంత్రి, ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరిపారని తెలిపారు. ప్రతినిధి బృందంలో కౌన్సిలర్లు భూక్యా శ్రీనివాస్, మునిగడప పద్మ, ధర్మరాజు, బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణ చారి, మునిగడప వెంకటేశ్వర్లు, యూసూఫ్, నేరెళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

భద్రతపై అవగాహన

ఇల్లెందు: అప్రెంటిస్ ఉద్యోగులు పని ప్రదేశంలో భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని గని మేనేజర్ శివప్రసాద్, వీటీసీ మేనేజర్ మహేష్ అన్నారు. బుధవారం ఇల్లెందులోని జేకే ఓసీ, వీటీసీలో అప్రెంటీస్‌లో ఉన్న వారికి కొత్తగూడెం రెస్క్యూ బృందంచే అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. యాంత్రికశక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, యంత్రాల పని గంటలు పెంచాలని, బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజువారీ లక్ష్యాలను అధిగమించాలని, ఉద్యోగులు రక్షణ చర్యలు పాటించాలని కోరారు.

చర్చలు విఫలం

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలోని జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) కార్యాలయంలో బీఆర్ దీక్షితులుతో కన్వేయన్స్ డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్ట్ విభాగాల మధ్య బుధవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ.. సింగరేణి కన్వేయన్స్ డ్రైవర్ల వేతనాలు జీఓ ప్రకారం చెల్లించాలని, సీఎంపీఎఫ్ పెండింగ్ డబ్బులు డ్రైవర్ల ఖాతాలలో జమ చేయాలని తదితర సమస్యలను ప్రస్తావించగా, ఈ సమస్యలను సింగరేణి చైర్మన్, మరియు డైరెక్టర్(పా)లతో చర్చించి పరిష్కార మార్గం చూస్తామని చర్చలు ముగించారు.

సింగరేణిలో ఉద్యోగం అదృష్టం

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టమని, సంస్థలో ఒత్తిడి లేకుండా ఉండటమే కాకుండా వివిధ సౌకర్యాలు కల్పించటం జరుగుతుందని జీఎం పర్సనల్ (ఆర్సీ, వెల్ఫేర్ అండ్ ఐఆర్‌పీఎం) బీ.ఆర్ దీక్షితులు అన్నారు. బుధవారం ఆయన చాంబర్‌లో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు నియామక పత్రాలు అందజేశారు. మాట్లాడుతూ... నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులు క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలన్నారు. సంస్థలోని అధికారుల ఆదేశాల మేరకు రక్షణ సూత్రాలు పాటిస్తూ, గైర్హాజరు కాకుండా పనిచేయాలన్నారు.

నులి పురుగులను నివారిద్దాం..



ఇల్లెందురూరల్: కొమరారంలో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఇల్లెందురూరల్: నులిపురుగుల నివారణకు ప్రతీఒక్కరు సహకరించాలని కోరుతూ కొమరారం, రొంపేడు పీహెచ్‌సీల పరిధిలో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ లోహిత, డాక్టర్ కవిత మాట్లాడుతూ.. చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగులను నిరోధించే పరాన్నజీవులు నులిపురుగులని చెప్పారు. 19 ఏళ్లలోపు పిల్లలు పౌష్టికాహార లోపంతో అనారోగ్యం పాలవుతుంటే నివారణ కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉన్న అల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని సూచించారు.

టేకులపల్లి: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం (ఎన్‌డీడీ) కార్యక్రమంలో భాగంగా గురువారం టేకులపల్లి మండలంలో అల్బెండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1–19 సంవత్సరాల వయస్సు పిల్లలకు అల్బెండజోల్ టాబ్లెట్ మింగించే కార్యక్రమం అన్ని పాఠశాలల్లో మరియు అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

పప్పు, పాలు అందించాలి



కలెక్టర్‌కు బొకేను అందిస్తున్న సింగరేణి అధికారులు

కొత్తగూడెంఅర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలకు పప్పు, పాలు, గుడ్లు, నూనె సకాలంలో అందించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నారటి ప్రసాద్, మల్లికార్జున్, కంచర్ల జమలయ్య, జి.నగేష్, గోనె మణి, ప్రమీల, వసంత, సరోజిన, రమాదేవి, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, కమల, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏరియా జీఎం...

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జితేష్ వి.పటేల్‌ను సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలెంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ జీకేఓసీ రమేష్, మధుకర్, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ తౌర్యానాయక్ పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్‌స్వామి, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి..



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చుంచుపల్లి/కొత్తగూడెంఅర్బన్: జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యలపై బుధవారం విద్యుత్ శాఖ ఎస్ఈ సర్కిల్ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ మాట్లాడుతూ.. జిల్లాలో విద్యుత్ శాఖలో సుమారు 4.50 లక్షల సర్వీసులు ఉన్నాయని ప్రతీ 1000 సర్వీసులకు ఒక లైన్‌మెన్, ఒక జూనియర్ లైన్‌మెన్ ఉండాలి కానీ ఆ విధంగా ప్రస్తుతం సిబ్బంది లేరన్నారు. ప్రతీ సబ్ స్టేషన్‌కు కనీసం ముగ్గురు ఆపరేటర్లు ఉండాలని, సబ్ స్టేషన్ ఆపరేటర్లలో వివిధ శాఖల్లో పనిచేసి రిటైర్డ్ అయిన సిబ్బందిని పెట్టుకోవడం వలన కూడా ఇబ్బంది కలుగుతోందన్నారు. అదేవిధంగా విద్యుత్ శాఖలో సుమారు 510 పోస్టులు మంజూరైనా వాటిలో 200 పోస్టులు భర్తీ కాగా, ఇంకా 210 పోస్టులు భర్తీ కావాల్సి ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీరోజు ఎటువంటి సమాచారం లేకుండా ప్రతీ గంటకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం జిల్లాలో అన్ని ప్రాంతాల్లో గంటకోసారి అప్రకటిత విద్యుత్ కోత కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, చుంచుపల్లి మండల అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరావు, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కొమ్ము వంశీ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సలీమ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు కటికల రంజిత్, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి కిరణ్, కార్యదర్శి మాలోత్ ప్రశాంత్ నాయక్, పాపావత్ నరేందర్, కరకపల్లి నాగరాజు, కిట్టు పాల్గొన్నారు.

తక్షణమే రోడ్డు నిర్మించాలి

సుజాతనగర్: వేపలగడ్డ గ్రామంలో శ్మశాన వాటికకు తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఐ రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య డిమాండ్ చేశారు. బుధవారం గ్రామస్తులతో కలిసి ఆక్రమణకు గురైన రహదారిని పరిశీలించారు. మాట్లాడుతూ.. సుమారు 500 కుటుంబాలు నివసిస్తున్న గ్రామంలో శ్మశానవాటికకు రోడ్డు లేకపోవడంతో ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలకు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణ గురైన భూమిపై సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీర్ల రమేష్, కొండె కృష్ణ, బచ్చలకూర శ్రీను, గండమల్ల భాస్కర్, ఉడుగుల శ్రీకాంత్, చిలకరెడ్డి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ... ఏనాటికైనా రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో పాలు, పండ్లు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): పొంగులేటి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



జూలూరుపాడులో....



ఇల్లెందు: కేక్ కట్ చేసి పంపిణీ చేస్తున్న దృశ్యం

రక్తహీనతపై అప్రమత్తంగా ఉండాలి



టేకులపల్లి: మాట్లాడుతున్న వైద్యాధికారి దినేష్

చుంచుపల్లి: మండలంలోని రుద్రంపూర్ హైస్కూల్ నందు పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ఆధ్వర్యంలో బుధవారం నేషనల్ సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెనగడప డాక్టర్ నేహా అంబ్రిన్, గుంటి ఎంపీఓ సత్యనారాయణ విద్యార్థులకు సికిల్ సెల్ వ్యాధి అనేది హిమోగ్లోబిన్ ప్రభావితం చేసే రుగ్మతల యొక్క సమూహమని, హిమోగ్లోబిన్ శరీరంలో వివిధ రకాల కణాలకు ఆక్సిజన్ అందించడంలో బాధ్యత వహిస్తుందని వివరించారు. విద్యార్థులు తప్పకుండా బలవర్ధకమైన ఆహారంతో పాటు రాగి జావా వంటివి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు, హెచ్‌ఎం బాలాజీ, సిబ్బంది జయలక్ష్మి, శ్రీదేవి, డాక్టర్ నవ్య జ్యోతి, హెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, హెచ్ఎస్ పూర్ణారావు, చంద్రకాంత్, రాణి, కృపమ్మ, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రపంచ రక్తహీనత నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సికెల్ సెల్ ఎనీమియా(రక్తహీనత)ను గుర్తించేందుకు రక్త పరీక్ష చేయనున్నట్లు చెప్పారు. బుధవారం నుంచి జూలై 3వ తేదీ వరకు 40 సంవత్సరాల వయస్సు లోపు వారి నుంచి రక్త నమూనాలు సేకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గౌతమ్, డాక్టర్ తేజశ్విని, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, హెడ్‌నర్సు విజయలక్ష్మి, స్టాఫ్ నర్సు సునీత, సుమితి, హెచ్‌వీలు సుభద్రమ్మ, రాధిక, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: రక్తహీనతపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని కొమరారం, రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ లోహిత, డాక్టర్ కవిత సూచించారు. కొమరారం, హనుమంతులపాడు గ్రామాలలో సికిల్ సెల్ ఎనీమియాపై బుధవారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. రక్తహీనత వల్ల కలిగే ఉపద్రవాలను వివరిస్తూ అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లలో మార్పులపై వివరించారు. రక్తహీనతకు గురైన మహిళలు వెంటనే సమీపంలోని పీహెచ్‌సీని సంప్రదించి సకాలంలో వైద్యసేవలు పొంది ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు.

టేకులపల్లి: సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనకు అవగాహనే ప్రధానమైనదని టేకులపల్లి మండలం సులానగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం పీహెచ్‌సీలో సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ... జూలై మూడో తేదీ వరకు పాఠశాలల్లో, గురుకులాల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాల్లో, ఆరోగ్య ఉప కేంద్రాలలో, మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన మరియు స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జన్యుపరంగా సంభవించే ఈ రక్త సంబంధిత వ్యాధిని నిర్మూలించడానికి ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోతు మౌనిక, ఆయుష్ వైద్యురాలు విజయశ్రీ, హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, వీసం శకుంతల, గుజ్జ విజయ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆదాయానికి గండి!

- టెండర్ పాత డబ్బు ఏమాయే..?
- చర్యలు తీసుకోని అధికారులు
- వారపు సంత, దినసరి మార్కెట్, కబేళాకు నేడు బహిరంగ వేలంపాట



మున్సిపల్ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఏ గ్రేడ్ కొత్తగూడెం మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడినా పాలకవర్గం, మున్సిపల్, జిల్లా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారదర్పంతో టెండర్ దక్కించుకొని, ఆ డబ్బు పూర్తిగా చెల్లించలేదు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు. గతేడాది మున్సిపాలిటీలోని గత అధికార పార్టీ కౌన్సిలర్లు, వారి భర్తలు 15 మంది కలిసి సిండికేట్‌గా డైలీ మార్కెట్ నిబంధనలను అనుకూలంగా మల్చుకొని రూ.50 లక్షలకు టెండర్‌ను దక్కించుకున్నారు. రూ.25 చెల్లించి మిగతా డబ్బును జేబులు నింపుకున్నారు. అప్పటి కమిషనర్ టెండర్ డబ్బులను వసూళు చేయలేకపోగా, అధికార పార్టీలో ఉన్నవారిపై చర్యలు తీసులేకపోతున్నామని చావుకబురు చల్లగా చెప్పేశాడు. దీంతో పాటుగా మరో వ్యక్తి కూడా సంత టెండర్‌ను రూ.50 లక్షలకు దక్కించుకొని వదులుకుంటునట్లు అధికారులకు వెల్లడించాడు. దీంతో సంతకు రూ.50 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.25 లక్షల వరకు మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడింది. అప్పుడు టెండర్‌ను దక్కించుకొని డబ్బులు చెల్లించలేకపోయిన వారిని బ్లాక్ లిస్ట్‌లో కూడా పెడుతున్నామని అధికారులు వెల్లడించారు. వారు మళ్లీ గురువారం జరగబోయే టెండర్ల ప్రక్రియలో అధికారులు అనుమతిస్తారో, లేదా బ్లాక్ లిస్ట్ అంటూ బహిష్కరిస్తారో వేచి చూడాలి.

నేడు బహిరంగ వేలంపాట...

కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం ఉదయం 10:30 గంటలకు బహిరంగ వేలంపాట జరుగనున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మున్సిపాలిటీలోని వారపు సంత, తైబజార్ (దినసరి మార్కెట్), కబేళాలు తొమ్మిది నెలల పాటు నిర్వహించడానికి వేలంపాట నిర్వహించనున్నారు. దరఖాస్తుదారులు రూ.2500 చెల్లించి బుధవారం షెడ్యూల్ పొందారు. కాగా దినసరి మార్కెట్, సంత, కబేళాలకు రెండు చొప్పున మొత్తం ఆరు టెండర్లు దాఖలయ్యాయి. వారపు సంతకు రూ.10 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.10 లక్షలు, కబేళాకు రూ.10 వేలు నగదు రూపంలో కానీ, డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు చెల్లించాలని అధికారులు సూచించారు. తొమ్మిదవ నెలలకు గాను వారపు సంత రూ.30 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.30 లక్షలు, కబేళాకు రూ.1 లక్ష టెండర్ దక్కించుకున్న వారు చెల్లించాల్సి ఉంటుంది.